

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కేంద్రాలు, స్ట్రాంగ్‌రూం గుర్తింపు
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నవంబరు 17, 18 తేదీల్లో జరగనున్న గ్రూప్-3 పరీక్షలకు జిల్లాలో 13500 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, అందు కోసం 37 కేంద్రాలను, స్ట్రాంగ్‌రూంను గుర్తించినట్లు కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. గ్రూప్-2, 3 పరీక్షల ఏర్పాట్లపై ఆయా జిల్లాల కలెక్టర్లతో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఇక డిసెంబరు 15న జరిగే గ్రూప్-2 పరీక్షకు కూడా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట ఏసీపీ మధు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పూలమాటున ప్రమాదం!

పక్క ఫొటోను చూసి పూలు భలే పూశాయే.. కొన్ని తెంపుదాం.. అనుకుంటే మీరు పొరబడినట్లే. ఎందుకుంటే పచ్చగా కనిపిస్తున్నది తోటకాదు... సిద్దిపేట పట్టణం నాసర్‌పురలోని కప్పలకుంటలో పెరిగిన గుర్రపు డెక్క, వాటికి తెల్లటి పూలు పూయడంతో పచ్చని తివాచీలో తెల్లపూలు చల్లినట్లు కనిపిస్తుంది. పొరపాటున కూడా ఆ పూలను కోసేందుకు అడుగేశారంటే ప్రమాదమే.. తస్మాత్..!

- సిద్ది పేట ఫొటోగ్రాఫర్, అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి)







ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఉత్సాహంగా క్రీడాపోటీలు

- ప్రారంభించిన అదనపు కలెక్టర్, డీఈవో
- పాల్గొన్న 2,500 మంది విద్యార్థులు
- రెండు రోజుల పాటు ఖోఖో, వాలీబాల్ పోటీల నిర్వహణ

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ జిల్లా స్థాయి క్రీడాపోటీలు సిద్దిపేట ప్రభుత్వ పాఠశాల మైదానంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సౌందర్యతో కలిసి క్రీడాజ్యోతి ప్రజ్వలన చేసి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి వాలీబాల్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమని చెప్పారు. సిద్దిపేట జిల్లా చదువులో, క్రీడల్లో అగ్రభాగాన నిలవాలని సూచించారు. నిత్యం సాధన చేయడం వలన ఆటల్లో రాణిస్తారని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సౌందర్య మాట్లాడుతూ అండర్-14, అండర్-17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్ పోటీలను రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అదనపు కలెక్టర్

సుమారు 2,500 మంది క్రీడాకారులు పోటీ పడనున్నట్లు ఆమె తెలిపారు. 150 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొంటారని చెప్పారు. ఈ క్రీడల్లో రాణించిన వారు ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో ఆడతారన్నారు. విజేతలకు బహుమతులు, భోజన సదుపాయానికి ఆర్థిక సహాయం అందిస్తున్న వీఎంఆర్ ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పిల్లలకు సరైన సమయంలో సహకారం అందిస్తే వారు ఏదైనా సాధించగలుతారన్నారు.



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

కమిటీల కయ్యాలు

ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక కమిటీలపై వివాదాలు

- గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఏడుగురి చొప్పున నియామకం
- కాంగ్రెస్ నేతల కనుసన్నల్లో జాబితాలు..?
- ఆ పార్టీలోనూ గ్రూపు రాజకీయాలు.. శ్రేణుల అసంతృప్తిరాగం
- ప్రత్యేక జాబితాలు తయారుచేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- ఉమ్మడి జిల్లాలో ఎంపీడీవోలు, ఉన్నతాధికారులకు తలనొప్పి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, అక్టోబరు 18: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. క్షేత్రస్థాయిలో అర్హుల ఎంపిక కోసం కమిటీలను నియమిస్తున్నది కమిటీలతో కయ్యం పుట్టుకొస్తున్నది. కమిటీలపై ఆధిపత్యం కోసం అధికార కాంగ్రెస్ నేతలు పట్టుబడుతుండగా.. బీఆర్ఎస్ శ్రేణులు అభ్యంతరం తెలుపుతున్నారు. ఇక గ్రామసభలు లేకుండా కమిటీల ఎంపిక కుదరదని బీజేపీ నాయకులు వాదిస్తున్నారు. అంతేగాకుండా కాంగ్రెస్ శిబిరంలోని గ్రూపు రాజకీయాలు సైతం కమిటీలను అభాసుపాలు చేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఐదుగురు సభ్యులపైనే రాద్ధాంతం

గ్రామాల్లో సర్పంచ్ లేనందున ప్రత్యేకాధికారే కమిటీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. మున్సిపల్ వార్డుల్లో కౌన్సిలర్ అధ్యక్షుడిగా, వార్డు ఆఫీసర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఇక్కడి వరకు అంతా సవ్యంగానే ఉంది. వీరు కాకుండా మరో ఐదుగురు సభ్యులను కమిటీలో నియమించాల్సి ఉంటుంది. ఈ ఐదుగురిలో ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, మరో ముగ్గురు గ్రామ అభివృద్ధిని కాంక్షించేవారై ఉండాలి. ఇందులో ఎస్సీ,బీసీ,ఓసీ సామాజిక వర్గాల వ్యక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఇద్దరు మహిళలను, ముగ్గురు వ్యక్తులను కమిటీల్లో ఎంపిక చేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మిగతా 7వ పేజీలో...

“చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీలను ఎంపిక చేశారు. కమిటీల్లో అందరూ కాంగ్రెస్ వాళ్లే ఉన్నారని జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీలు వేసి కలెక్టర్‌కు అందజేశారు. ఎవరికి వారు ఆయా పార్టీల కమిటీల్లో చోటు కల్పించి ప్రతిపాదించారు.

గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, నారాయణఖేడ్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ పార్టీలో వేర్వేరు గ్రూపులు ఉన్నాయి.ఆయా ప్రాంతాల్లో ఇందిరమ్మ కమిటీల్లో ప్రతిపాదించిన పేర్లు మరో గ్రూపునకు నచ్చడం లేదు. కాగా సొంత పార్టీలోనే అసమ్మతి కనిపిస్తోంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఉమ్మడి మెదక్ కాంగ్రెస్ నేతల సమీక్షలోనూ గ్రూపులపై చర్చకు వచ్చినట్లు సమాచారం.”



గ్రామసభలు లేకుండానే ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేశారని కొడిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు (ఫైల్)

నామినేటెడ్‌పై నజర్..

- గజ్వేల్‌లో పదవుల పందేరం
- భర్తీకి అధిష్ఠానం కసరత్తు
- తమకంటే తమకే ఇవ్వాలని పట్టుబడుతున్న ఆశావహులు

గజ్వేల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ రసవత్తరంగా సాగుతుంది. గజ్వేల్ ఏఎంసీ పాలకవర్గాన్ని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయగా మిగిలిపోయిన నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియకు శరవేగంగా పావులు కదుపుతుంది. ములుగు మండలం వంటిమామిడిలోని మార్కెట్ కమిటీ పాలకవర్గం, కొండపాక వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం, వర్గల్ మండలం నాచారం దేవాలయ కమిటీ పాలకవర్గం, జగదేవపూర్ మండలం కొండపోచమ్మ ఆలయ పాలకవర్గాల పదవులపై పలువురు ఆశలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో గజ్వేల్‌లో డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి తన పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు తన వర్గంతో అధిష్ఠానాన్ని కలిసినట్లు తెలుస్తోంది. పదవుల భర్తీలో తమకంటే తమకు పెద్దపీట వేయాలని ఇరువర్గాలు అధిష్ఠానం పెద్దల వద్ద మొరపెట్టుకుంటున్నట్లు తెలిసింది. ఇటీవల గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటులో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తనదైన ముద్ర వేసి తన అనుచరులకు చైర్మన్ పదవితో పాటు మార్కెట్ డైరెక్టర్ పదవులను ఇప్పించుకున్నారు. మరోసారి తన వర్గానికే ప్రాధాన్యత దక్కేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. గజ్వేల్ మార్కెట్ కమిటీ పాలకవర్గం విషయంలో తాము అధిష్ఠానం మాటకు కట్టుబడి ఉన్నామని, తాజాగా భర్తీ చేసే పదవుల్లో తమకు ప్రాధాన్యతనివ్వాలని శ్రీకాంత్‌రావు వర్గం కోరుతున్నట్లు తెలుస్తుంది. ఎవరి వర్గానికి అధిష్ఠానం పెద్దపీట వేస్తోందో అని గజ్వేల్ నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వంటిమామిడి మార్కెట్ చైర్మన్ పదవి దాదాపుగా వర్గల్ మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ మోహన్ సతీమణికి ఖరారైనట్లు తెలుస్తుంది. ఈ నామినెటెడ్ పదవుల పందేరంలో ఆధిపత్యం కోసమే ఇరు వర్గాలు పోరాటం చేస్తున్నట్లు పలువురు భావిస్తున్నారు.

మేం తెచ్చాం.. కాదు మేమే..

- కడవేరుగు బ్రిడ్జి పనుల ప్రారంభంపై పోటాపోటీ ప్రకటనలు
- మొన్న బీఆర్ఎస్..నిన్న కాంగ్రెస్ నేతల మిఠాయిల పంపిణీ



కడవేరుగు బ్రిడ్జి పనుల ప్రారంభంతో మిఠాయిలు పంచుకుంటున్న బీఆర్ఎస్ నేతలు

చేర్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటం, జనగామ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే ఉన్న నేపథ్యంలో కొంత కాలంగా అభివృద్ధి పనులు, ఇతరత్రా కార్యక్రమాల నిర్వహణలో కాస్త గందరగోళం నెలకొంటున్నది. ఇప్పటికే రెండు పార్టీల మధ్య ప్రోటోకాల్ రగడ కొనసాగుతున్నది. నియోజకవర్గానికి నిధులు మంజూరైనా రెండు పార్టీల నాయకులు కుస్తీ పడుతున్నారు. తామంటే తామే మంజూరు చేయించామని పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. తాజాగా చేర్యాల మండలం కడవేరుగు గ్రామ శివారులో బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభమవడంతో ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటూ పోటాపోటీ కార్యక్రమాలు చేపట్టడం మరోమారు చర్చనీయాంశంగా మారింది. చేర్యాల మండలం కడవేరుగు శివారులో లో-లెవల్ కాజ్‌వే గుండా వర్షాకాలంలో వరద నీరు ప్రవహిస్తుండటంతో సమీప గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతుంటాయి. ఏడాదిన్నర క్రితం గత ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.72 కోట్లు నిధులు మంజూరు కాగా టెండర్లు పిలిచింది. అప్పటి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి శంకుస్థాపన చేసినప్పటికీ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. అంతలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ప్రారంభానికి నోచుకోని పనుల నిధులు నిలిపివేసింది. ఇంతలో వర్షాలు కురవడం, వరద నీటి ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోవడంతో స్థానికులు, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, స్థానిక కాంగ్రెస్ నాయకులు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి విన్నవించారు. ఇటీవల సిద్దిపేట జిల్లా సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విషయమై కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సైతం పనుల ప్రారంభానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం కోసం సమీపంలో ఇటీవల డైవర్షన్ రోడ్డు పనులు చేపట్టారు. ఈ పనుల ప్రారంభానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవనే కారణమని పేర్కొంటూ గురువారం బీఆర్ఎస్ నేతలు మిఠాయిలు పంచి హర్షం వెలిబుచ్చారు. కొమ్మూరి వల్లే సాధ్యమైందని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మిఠాయిలు పంపిణీ చేశారు. బ్రిడ్జి పనులు చేపట్టకపోగా, డైవర్షన్ రోడ్డు పనులకే పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహించి విమర్శ, ప్రతివిమర్శలు చేసుకుంటుండటంతో రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కింది.



మిఠాయి పంచుకుంటున్న కాంగ్రెస్ నేతలు

చిన్నారిపై శునకాల దాడి

- కాపాడబోయిన మరో వ్యక్తిపైనా..

బెజ్జంకి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న ఓ చిన్నారిపై వీధి శునకాలు దాడి చేసిన ఘటన బెజ్జంకి మండలం చీలాపూర్‌పల్లిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన గజ్జెల రిషిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుంది. ఈ క్రమంలో చిన్నారిపై ఒక్కసారిగా వీధి కుక్కలు దాడిచేశాయి. చిన్నారి కేకలు విని స్థానికుడు గజ్జెల సంతోష్ గమనించి కుక్కలను తరిమికొట్టే ప్రయత్నం చేయగా అతనిపైనా దాడి చేశాయి. స్థానికులు గమనించి వాటిని వెళ్లగొట్టి గాయపడిన రిషిక. సంతోష్‌ను చికిత్స నిమిత్తం బెజ్జంకి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



చికిత్స పొందుతున్న చిన్నారి రిషిక

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- రోడ్డు పక్కన పొదలమాటున..
- చుట్టూ కంచె ఏర్పాటు చేయని వైనం
- భయాందోళనలో వాహనదారులు

8

పాఠశాల భవనం పైనుంచి పడి విద్యార్థినికి గాయాలు

7

- పండుగ సెలవుల తరువాత వచ్చిన కొద్దిగంటల్లోనే ఘటన

అపరిచిత కాల్స్‌తో మోసపోవద్దు

- ఉద్యోగాల పేరిట మోసంపై కేసు : సీఐ

గజ్వేల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరిట జరిగిన సైబర్ మోసంలో కేసు నమోదు చేసినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు. గజ్వేల్‌తో పాటు రాయపోల్ మండలానికి చెందిన పదిమంది ఓ ప్రజాప్రతినిధి మధ్యవర్తిత్వంతో విద్యుత్‌శాఖలో ఆపరేటర్ ఉద్యోగాలు ఉన్నాయని నమ్మి ఆగంతకుడికి రూ.19,500 బదిలీ చేశారు. ఆ తర్వాత వారంతా మోసపోయినట్లు గుర్తించి గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఉద్యోగాలు, ఇతరత్రా ఆకర్షణీయమైన ఆఫర్ల పేరిట వచ్చే మోసపూరిత కాల్స్‌ను నమ్మకూడదని ఆయన సూచించారు. ఇలాంటి ఫోన్లు వచ్చినప్పుడు వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏదైనా సైబర్ మోసం జరిగినట్లు గుర్తిస్తే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని చెప్పారు.

మునిపల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

మునిపల్లి, అక్టోబరు(ఆంధ్రజ్యోతి)18 : మునిపల్లి పోలీస్‌స్టేషన్‌ను సంగారెడ్డి ఎస్పీ రూపేష్ గువావారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని కేసుల నమోదును ఆయన పరిశీలించారు. ఆయన వెంట అదనపు ఎస్పీ సంజీవరావ్, కొండాపూర్ సీఐ చంద్రయ్య, ఎస్ఐ రాజేష్‌నాయక్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించాలి

● సంగారెడ్డి డీపీవో సాయిబాబా


మురుగు కాలువను పరిశీలిస్తున్న డీపీవో

కొండాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించాలి జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా సూచించారు. ఫ్రై డే- డ్రై డే సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామాన్ని డీపీవో సందర్శించి గ్రామంలో స్వచ్ఛత, పారిశుధ్యం పనులపై ఆరా తీశారు. తాగునీటి సరఫరా, చెత్తసేకరణ, మురుగు కాలువల పరిశుభ్రత తదితర పనులను పరిశీలించారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి పరిసరాల పరిశుభ్రత, మొక్కల సంరక్షణపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు అందిస్తున్న ఆహారం, సేవలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఎల్ఆర్ఎస్ ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. గ్రామంలో 3వేలకుపైగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు వాటిని ఆన్‌లైన్‌లో నమోదు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు మన్‌మోహన్,కిషోర్ తదితరులు ఉన్నారు.

● జహీరాబాద్ : పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరు పాటించాలని మండల ప్రత్యేకాధికారి, వ్యవసాయశాఖ ఏడీఏ బిక్షపతి పేర్కొన్నారు. శుక్రవారం ఫ్రైడే - డ్రై డే సందర్భంగా ఆయన మండలంలోని సత్వార్ తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లో పోగైన చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయరాదని, చెత్తసేకరణకు వచ్చే వాహనాల్లోనే వేయాలని సూచించారు. వెంట ఎంపీడీవో మహేందర్ రెడ్డి, అధికారులు, గ్రామస్థులు ఉన్నారు.

పొగాకు ఉత్పత్తులు
ఆరోగ్యానికి హానికరం

● పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి

కంది, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పొగాకు ఉత్పత్తుల వాడకం ఆరోగ్యానికి హానికరమని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైసర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా కంది జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు.. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులైన బీడి, చుట్ట, సిగరెట్, జరదా, తంబాకు, పాన్‌మసాల లాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనేనా ఉపయోగించవద్దన్నారు. వీటి వాడకంతో హైపర్ టెన్షన్, నోటి క్యాన్సర్, శ్వాసకోస, గుండె సంబంధిత వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. పొగాకు ఉత్పత్తులు వాడే వారికి దూరంగా ఉండాలని ఆయన సూచించారు. బహిరంగ ప్రదేశాలలో ధూమపానం చేస్తే సెక్షన్ 4 ప్రకారం రూ.200 జరిమానాను విధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన

కోహీర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దిగ్వాల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి శ్రవణ్ కుమార్ ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలు, బాల్యవివాహాలు, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన, ఫోక్సో చట్టం తదితర అంశాలపైన వివరించారు. విద్యార్థినులు వీటన్నిటిపైన పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా చదువుకునే విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సోషల్‌మీడియాను ఎక్కువగా వాడరాదని సూచించారు. మంచి విషయాలను గ్రహించి, చెడును వెంటనే తిరస్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వసంత్‌రాజు, చంద్రశేఖర్, ముజీబ్, శ్రీనివాస్, సీఆర్పీ జర్నప్ప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



గణేష్ (ఫైల్)

నర్సాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన బ్యాగరి గణేష్(45) ఈ నెల 16న ఉదయం కాలకృత్యాల కోసం బయటకు వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో ఆచూకీ కోసం గాలించిన కుటుంబీకులకు 17న సాయంత్రం గ్రామ శివారులోని పెద్ద చెరువులో అతడి మృతదేహం లభించింది. కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి ఉంటాడని భావిస్తున్నారు. భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గేదెను తప్పించబోయి వ్యక్తి...

చిలప్‌చెడ్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గేదెను తప్పించబోయి కిందపడడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలం పరిధిలోని చిట్కుల్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ధారబోయిన వీరేశం (49) 17న సాయంత్రం పొలం నుంచి బైకుపై ఇంటికి వస్తున్నాడు. గ్రామ శివారులోని కస్తూర్బా పాఠశాల సమీపంలో రాగానే అడ్డుగా వచ్చిన గేదెను తప్పించే క్రమంలో బైకు అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయలయ్యాయి. దీంతో అతడిని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

హార్వెస్టర్ ఢీకొని వ్యక్తి..

మెదక్ కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హార్వెసర్ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్లితే కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం గుండారం గ్రామానికి చెందిన షేక్ ఆరిఫ్ బతుకు దెరువు కోసం మెదక్ మండలంలోని మంబోజిపల్లిలో బజ్జీల బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మంబోజిపల్లి-చిట్యాల రోడ్డుపై ఆరిఫ్‌ను హార్వెస్టర్ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన అతడిని ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. హార్వెస్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే తన భర్త మరణించాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



మమత(ఫైల్)

పుల్‌కల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందింది. వివరాల్లోకి వెళ్లితే చౌటకూర్ మండలం గంగోజిపేట గ్రామానికి చెందిన కాశపాగ బాలయ్య కూతురు మమత(24)కు భర్తతో విడాకులు తీసుకుని గ్రామంలోని నాయనమ్మ వద్ద ఉంటున్నది. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయటికెళ్లిన ఆమె శుక్రవారం చక్రియాల గ్రామ శివారులో హన్మాపూర్ గ్రామం వద్ద 161 జాతీయ రహదారి పక్కన శవమై కనిపించింది. సమాచారం అందుకున్న సీఐ అనిల్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవుసులపల్లిలో వ్యక్తి..



శివ (ఫైల్)

మెదక్ కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మెదక్ పట్టణం లోని అవుసులపల్లిలో గురువారం రాత్రి జరిగింది. మృతుడి తల్లి లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాగారం శివ (23) సాయంత్రం తన బావ కుమారుడితో కలిసి మద్యం సేవించాక బయటకెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఇంటి పరిసరాలలో వెతకగా గడ్డివాము వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.



అన్న వితరణ కోసం కూరగాయలు కోస్తున్న సభ్యులు



వృద్ధుడికి సాయం చేస్తూ..

గంగా జమునా తహజీబ్

- సేవే లక్ష్యంగా పని చేస్తున్న సంస్థ
- కుల మతాలకు అతీతంగా సభ్యులు
- అనాథ శవాలకు అంత్యక్రియలు
- మానసిక దివ్యాంగులకు చేయూత
- ఉచిత అంబులెన్స్ సేవలు



ఉచిత అంబులెన్సు సేవలు

మెదక్ కల్చరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : నేటి యువతలో ఎక్కువ మంది రీల్స్, లైక్స్, షేర్ అంటూ కాలం గడుపుతుంటే వారు మత్రం తమకు దొరికిన కొద్ది సమయాన్ని సమాజ సేవకు వినియోగిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. గంగా జమునా తహజీబ్.. పేరుకు తగ్గట్లుగానే ఆ సంస్థ సభ్యులు అనాథలు, అభాగ్యులు, మానసిక దివ్యాంగులు.. ఆపదలో ఉన్న వారు ఎవరైనా సేవకు సై అంటారు. వారికి మేమున్నామంటూ బాసటగా నిలుస్తున్నారు. ఉన్నంతలో పది మందికి సాయం చేయాలని సంకల్పించి.. ముందుకు సాగుతున్నారు. సేవే లక్ష్యంగా పేదింటి ఆడపిల్లలకు పెళ్లిళ్లు, విద్య, వైద్యం అందించడంతో పాటు అనాథ శవాల ఖననం, మానసిక దివ్యాంగులకు చేయూతనివ్వడం, శ్మశానాల్లో పిచ్చి మొక్కలు తొలగించడం, అంబులెన్స్ సేవలు ఇలా పలు రకాల సేవలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మెదక్ జిల్లా కేంద్రంలోని అరబ్ గల్లీకి చెందిన గంగా జమున తెహజీబ్ సంఘ సభ్యులు.

అనాథ శవాలకు ఆ నలుగురు..

గంగా జమున తహజీబ్ పేరిట సామాజిక సేవ సంస్థ ఏర్పాటై కేవలం మూడేళ్లు మాత్రమే అవుతోంది. ఈ కొద్దికాలంలోనే సంస్థ సభ్యులు వేర్వేరు చోట్ల అనాథలుగా పడి ఉన్న మృతదేహాల ఖననానికి మేమున్నామని ముందుకు వచ్చారు. జిల్లా కేంద్రం, పరిసర గ్రామాల్లో 12 అనాథ శవాలను ఖననం చేశారు. మరణించిన తర్వాత కనీసం సొంత ఇంటికి వెళ్లే పరిస్థితి లేని వారుంటే వారినీ ఇంటికి చేర్చడంలో తమ వంతు పాత్ర పోషించారు. ఇప్పటి వరకు ఆరుగురిని ఇలా వారి స్వగృహాలకు చేర్చారు. 9 మంది పేదింటి అమ్మాయిలకు ఉచితంగా వివాహాలు జరిపించారు. రోడ్లపై ఎక్కడైనా మానసిక దివ్యాంగులు కనిపిస్తే వారిని చేరదీసి.. వారికి కటింగ్, స్నానం చేయించి.. వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రికి తరలిస్తారు.

ఉచితంగా అంబులైన్స్

గంగా జమున తహజీబ్ ఆధ్వర్యంలో ఉచిత అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మెదక్‌కు చెందిన బంగారం వ్యాపారి నసీర్ అంబులెన్స్ వాహనాన్ని సమకూర్చగా.. దానిని సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వైద్యం కోసం అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లాలనుకునే వారు పెట్రోలుకు రూ.1500, డ్రైవర్‌కు రూ. 500 ఇస్తే చాలు గమ్యస్థానానికి చేరుస్తున్నారు. ఆ డబ్బులూ ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్న వారికి ఉచితంగా అంబులెన్స్ అందిస్తున్నారు.

కుల మతాలకతీతంగా సభ్యులు..

గంగా జమునా తహజీబ్ అన్న పేరుకు తగ్గట్లుగానే ఇందులో సభ్యులు కూడా కులమతాలకు అతీతంగా ఉన్నారు. సంస్థ అధ్యక్షుడిగా వాసిం, సభ్యులుగా ప్రవీణ్, నవీద్, నజీబ్ , సులేమాన్, రేహాన్, లయిక్, వాజిద్, సురేష్, మహబూబ్, నజీమ్, మసూద్, గౌస్, ఆమేర్, ఆసిఫ్, ఇష్తికార్, రిహాన్, బాబు, తదితరులు ఉన్నారు.

సేవ చేయడంలో ఉన్న సంతృప్తి వేరు



ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, వారికి సేవ చేయడంలో ఉన్న తృప్తి ఇంకెక్కడా దొరకదు. చిన్న కుటుంబంలో పుట్టినా.. సేవ చేయాలనే సంకల్పంగా గంగా జమునా తహజీబ్ సంస్థను ఏర్పాటు చేశాను. సభ్యుల సహకారంతో సేవ కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇందుకు దాతలు కూడా సహకరిస్తున్నారు.

-వాసిం, గంగా జమున తహజీబ్ సంస్థ అధ్యక్షుడు

బస్సుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు

రామాయంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కళాశాలల సమయానికి ఆర్టీసీ బస్సులు నడపడం లేదంటూ విద్యార్థులు శుక్రవారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. మూడు గ్రామాల విద్యార్థులు రామాయంపేట-అక్కన్నపేట రహదారిపై గంటపాటు రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ఒకే ఒక్క బస్సు నడపటం.. అదీ కూడా సమయానికి రాకపోవడంతో చదువుకునేందుకు రామాయంపేట వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించే దాకా ఆందోళన విరమించబోమంటూ భీష్మించి కూర్చున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై బాలరాజ్ అక్కడికి చేరుకొని విద్యార్థులను సముదాయించి రాస్తారోకో విరమింపజేశారు. విద్యార్థుల ఆందోళనకు ఏబీవీపీ మద్దతుగా నిలిచింది.

చిన్నారి మృతితో సీహెచ్‌సీ ఎదుట ఆందోళన



కల్హేర్ పీహెచ్‌సీ దుట ధర్నా చేస్తున్న బాధితులు, యువకులు

కల్హేర్, అక్టోబరు 18: మూడు నెలల చిన్నారి మృతికి టీకానే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ శుక్రవారం కల్హేర్‌లోని కమ్యూనిటీ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు వివరాల్లోకి వెళ్లితే కల్హేర్‌కు చెందిన కొక్కొండ ఓంసాయి, అనిత దంపతుల కూతురు ఆరాధ్య(3 నెలలు)ను టీకాల కోసం బుధవారం కల్హేర్‌లోని కమ్యూనిటీ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. టీకా వేసిన అనంతరం పాప ఏడ్వడం ఆపకపోవడంతో వైద్యాధికారి అనిల్‌రెడ్డి దగ్గరికి తీసుకువెళ్లారు. కాసేపటికి చిన్నారి అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో వైద్యాధికారి సూచనమేరకు కామారెడ్డి జిల్లా బాన్స్‌వాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు గురువారం కల్హేరు పీహెచ్‌సీ ఎదుట ఆందోళనకు దిగగా వైద్యాధికారి సెలవులో ఉన్నట్లు తెలిసింది. దీంతో తిరిగి శుక్రవారం ఆందోళన చేపట్టారు. దీనిపై కల్హేర్ సీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌రెడ్డిని సంప్రదించగా బాలిక ఏడుస్తున్న సమయంలో పాలు పట్టడంతో కార్డియాక్ అరెస్ట్ జరిగిందని, తాము సీపీఆర్ చేసి మెరుగైన వైద్య కోసం ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు. కాగా, పోలీసులు అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

దూషించాడని మట్టుబెట్టాడు

●హత్య కేసును చేధించిన పోలీసులు ●నిందితుడికి రిమాండ్



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న చేర్యాల సీఐ

మద్దూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దూళిమిట్ట మండలంలోని బెక్కల్ గ్రామానికి చెందిన భైరగోని యాదగిరి హత్య కేసును పోలీసులు చేధించారు. తనను దూషించాడన్న కారణంతో హత్యకు పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం మద్దూరు పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ శ్రీను వెల్లడించారు. భైరగోని యాదగిరి తాటిచెట్లు ఎక్కేందుకు ఈ నెల13న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా, 15న కూటిగల్ శివారులోని బ్రిడ్జి వద్ద అతడి మృతదేహం లభించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు భైరాన్‌పల్లికి చెందిన నందనబోయిన బాలకృష్ణను అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బెక్కల్ శివారులో బాలకృష్ణకు వ్యవసాయ భూములుండటంతో తరుచూ ఆ గ్రామానికి వెళ్లేవాడు. ఈ క్రమంలో యాదగిరి కుటుంబంలోని పాపకు ఆరోగ్యం సరిగాలేకపోవడంతో చికిత్స కోసం భైరాన్‌పల్లికి బైకుపై తీసుకెళ్లేందుకు బాలకృష్ణ ప్రయత్నించేవాడు. దీంతో అనుమానంతో యాదగిరి బాలకృష్ణను దూషించాడు. దీన్ని మనసులో పెట్టుకున్న అతడు యాదగిరిని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం కూటిగల్‌లోని వైన్స్‌కు అతడిని తీసుకెళ్లి మద్యం కొనుగోలు చేశాడు. అనంతరం యాదగిరి బైకును అక్కడే ఉంచి గ్రామ శివారులో మద్యం తాగేందుకు బాలకృష్ణ తన బైకుపై తీసుకెళ్లాడు. ఫుల్‌గా మద్యం తాగిన తరువాత యాదగిరిని బాలకృష్ణ దుడ్డు కర్రతో బాది హత్యచేశాడు. ఈ సమావేశంలో ఎస్ఐ షేక్ మహబూబ్, శిక్షణ ఎస్ఐ అరుణ్, ఏఎస్ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కరువు భత్యం విడుదల చేయాలి

● టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్

మెదక్ అర్బన్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు రావాల్సిన ఐదు విడతల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక సంఘ భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిన విధంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల అన్ని రకాల బిల్లులు చెల్లించాలన్నారు. ఈ నెల 22న ఉద్యోగుల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయాలని నిర్ణయించామన్నారు. టీఎస్‌జీఎల్ఐ కార్యాలయాన్ని సంగారెడ్డి నుంచి మెదక్‌కు తరలించాలని, మెడికల్ సిబ్బంది ఏంపీహెచ్‌ఏలకు అదనపు ఇంటి అద్దె అలవెన్స్, ఏఈవోలకు సహాయకులను నియమించాలని జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ తీర్మానం ప్రవేశపెట్టగా ఆమోదించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనురాధ, జిల్లా సహా అధ్యక్షుడు ఇక్బాల్‌పాషా, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఫణిరాజ్, ఫజులొద్దిన్, రఘునాథరావు, లీల, సంయుక్త కార్యదర్శులు శంకర్, శివాజీ, కిరణ్, రాధా, విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్, రామాయంపేట, చేగుంట, అల్లాదుర్గం, నర్సాపూర్, ఏడుపాయల వనదుర్గా యూనిట్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి

● డీఈవో రాధాకిషన్

మెదక్ అర్బన్, అక్టోబరు18:(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగడానికి కృషి చేయాలని డీఈవో రాధాకిషన్ సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా జట్టు ఎంపిక కోసం అండర్-17 బాలబాలిక విభాగంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో ప్రథమ బహుమతి శివ్వంపేట, ద్వితీయ బహుమతి మెదక్, బాలికల విభాగంలో ప్రథమ నర్సాపూర్, ద్వితీయ శివ్వంపేట మండలం విజేతలుగా నిలిచారు. ముగింపు కార్యక్రమానికి డీఈవో హాజరై ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

నేడు జిల్లాకు హైకోర్టు జస్టిస్ విజయసేన్‌రెడ్డి రాక

మెదక్ అర్బన్, అక్టోబరు18 : (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు జస్టిస్ విజయసేన్‌రెడ్డి శనివారం మెదక్ జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జస్టిస్ విజయసేన్‌రెడ్డి ఉదయం 8:15 గంటలకు ఏడుపాయల అమ్మవారి దర్శించుకుని, అక్కడి నుంచి ఉదయం 10 గంటలకు అల్లాదుర్గంలోని కోర్టు కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. ఆ తర్వాత మెదక్ చేరుకొని బార్ అసోసియేషన్‌తో సమావేశం నిర్వహించి, మధ్యాహ్నం 2:30 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారని తెలిపారు. జస్టిస్ పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు రాకుండా ఏర్పాట్లతోపాటు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంటున్నారు.

నేడు ఉమ్మడి జిల్లా హాకీ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : కంది సమీపంలోని ఐఐటీహెచ్ డీపీవీ పాఠశాలలో నేడు ఉమ్మడి జిల్లా హాకీ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అమూల్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 బాలురు, బాలికల ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఒరిజినల్ బోనాఫైడ్‌తో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9492912008, 9014567800 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఉత్సవ విగ్రహాలు చోరీ

రాయపోల్, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): మండలం పరిధి ఆరెపల్లి గ్రామంలో ని పెద్దమ్మ గుడిలో ఉత్సవ విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. రాయపోల్ ఎస్‌హెచ్‌వో రాజు కథనం ప్రకారం ఆలయంలో కొంతకాలంగా కాశమైన యాదయ్య, అండాలమ్మ దంపతులు ఆలయ సేవకులుగా పనిచేస్తున్నారు. రోజు మాదిరిగా గురువారం పూజలు చేసి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం గుడి రాగా తాళాలు తీసి ఉండడంతో లోపలికి వెళ్లి పరిశీలించారు. దీంతో ఆలయంలోని పెద్దమ్మ, పెద్దిరాజు ఉత్సవ విగ్రహాలు కనిపించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గుడిలోని బంగారు ఆభరణాలు మాత్రం అలాగే ఉండడం గమనార్హం.

ప్రేమ వివాహంతో ఘర్షణ.. వరుడి ఇల్లు ధ్వంసం

● కేసు నమోదు చేసిన పోలీసులు



ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

రాయపోల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివాహం కారణంగా వరుడి ఇంటిని ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసిన సంఘటన రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. రాయపోల్ ఎస్‌హెచ్‌వో రాజు కథనం ప్రకారం రాయపోల్ మండలంలోని ఒకే గ్రామానికి చెందిన అమ్మాయి, అబ్బాయిలు ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వధువు కుటుంబ సభ్యులు శుక్రవారం వరుడి ఇంటిని ధ్వంసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మూడు పాడి గేదెలు మృతి



జిన్నారం, అక్టోబరు 18: (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మూడు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. వావిలాల గ్రామానికి చెందిన నందిగామ కృష్ణ, వీరేశం, లక్ష్మీలకు చెందిన పాడి గేదెలు గురువారం గ్రామ శివారులో మేతకు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా తెగిపడిన విద్యుత్ వైర్లను తాకడంతో షాక్ గురై మృతిచెందాయి. ఒక్కో గేదె విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. పంచాయతీ సెక్రటరీ, విద్యుత్ అధికారులు ఘటన వివరాలు సేకరించారు.

గురుకుల పాఠశాల భవనంపై నుంచి పడి

విద్యార్థినికి గాయాలు

పండుగ సెలవుల తరువాత వచ్చిన కొద్దిగంటల్లోనే ఘటన

ప్రమాదవశాత్తా.. ఆత్మహత్యయత్నమా !?





చికిత్స పొందుతున్న హిమబిందు, కాళ్లకు గాయాలు

చేర్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని జనగామ జిల్లా సర్వోట్ట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల భవనంపై నుంచి ఓ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో కింద పడి తీవ్రగాయాపాలైంది. వివరాల్లోకి వెళ్లితే ములుగు జిల్లాకు చెందిన హిమబిందు గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నది. ఇటీవల దసరా పండుగ సెలవులకు ఇంటికి వెళ్లి శుక్రవారం మధ్యాహ్నం తిరిగి వచ్చింది. ఏమైందో తెలియదు కాని కాసేపటికి హిమబిందు భవనంపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడడంతో ఉపాధ్యాయులు చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె అప్పటికే అపస్మారక స్థితిలో ఉండటంతో అక్కడ ప్రథమ చికిత్స అందించి అనంతరం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ సంఘటన ప్రమాదవశాత్తు జరిగిందా.. లేదా ఆత్మహత్యయత్నమా.. అన్న విషయం తేలియాల్సి ఉంది. ఈ విషయమై ప్రిన్సిపాల్ మన్విచంద్‌ను సంప్రదించగా తాను సెలవులో ఉన్నానని, హిమబిందు కొన్నాళ్లక్రితమే పాఠశాలలో చేరిందన్నారు. భవనంపై దుస్తులు తీస్తున్న క్రమంలో గోడమీదనుంచి పడ్డానని తమతో హిమబిందు తెలిపిందని, ఎలాంటి ప్రాణాపాయం లేదని తెలిపారు.

5వ పేజీ తరువాయి..

కమిటీల కయ్యాలు

దీనిపై బీఆర్ఎస్ నేతలు కూడా సొంతంగా కమిటీలు వేసి జాబితాలు సిద్ధం చేస్తున్నారు. ఐదుగురు సభ్యులను తమ పార్టీకి అనుకూలంగా ఉన్నవారినే ఎంచుకుంటున్నారు. కొన్ని చోట్ల ఏకంగా ఆయా పార్టీల గ్రామ అధ్యక్షులు, ముఖ్యనేతలకే కమిటీల్లో చోటు కల్పిస్తున్నారు. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులే ఈ కమిటీలపై పూర్తిస్థాయి ఆధిపత్యం కనబరుస్తున్నారనే చర్చ జరుగుతోంది.

అధికారులకు తలనొప్పిగా..

గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో సిద్ధం చేసిన ఇందిరమ్మ కమిటీల జాబితాలను ముందుగా ఎంపీడీవోకు, తర్వాత కలెక్టర్‌కు అందజేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే అందజేసిన జాబితాలపై అనేక అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీడీవోల వద్దకు చేరిన జాబితాల్లోనూ మార్పులు, చేర్పులు చేసిన సంఘటనలు ఉమ్మడి జిల్లాలో నెలకొన్నాయి. ఇక కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు ఉన్న స్థానాల్లో అధికారులకు తలనొప్పి తయారైంది. ఓ గ్రూపు నుంచి వచ్చిన జాబితాను కలెక్టర్‌కు పంపిస్తే మరో గ్రూపు నుంచి ఏ సమస్య వచ్చిపడుతుందోనని ఆలోచిస్తున్నారు. ఇదే పరిస్థితి జిల్లా స్థాయి అధికారుల్లోనూ కనిపిస్తోంది. ఇక కాంగ్రెస్ జాబితాలకు పోటీగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలూ ఇందిరమ్మ కమిటీల జాబితాలు ఇవ్వడమే రసవత్తరంగా మారింది.

ఉమ్మడి జిల్లాకు 40వేల ఇండ్లు..

నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఒక్కో ఇంటికి రూ.5లక్షల చొప్పున నిధులు అందజేస్తామని భరోసా కల్పించారు. స్థలం లేని పేదలకు స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి సహకరిస్తామని చెప్పారు. పూర్తిస్థాయిలో అర్హులకే ఇండ్లు దక్కాలని ఈ ఇందిరమ్మ కమిటీలకు లబ్ధిదారుల ఎంపిక బాధ్యత అప్పగించనున్నారు. ఉమ్మడి జిల్లాలో సంగారెడ్డి, పటాన్‌చెరు, ఆందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్, సిద్దిపేట, దుబ్బాక, మెదక్, నర్సాపూర్, గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. సిద్దిపేట నూతన జిల్లాలో హుస్నాబాద్, జనగామ నియోజకవర్గంలోని 4 మండలాలు, మానకొండూరు నియోజకవర్గంలోని బెజ్జంకి మండలం ఉంది. ఈ లెక్కన సుమారు 40 వేల ఇండ్లు తొలిదశలో జిల్లాకు దక్కనున్నాయి. విమర్శలకు తావివ్వకుండా లబ్ధిదారులను ఎంపిక చేయడమే కమిటీల ముందున్న కర్తవ్యం.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం గజ్వేల్ మండల పరిధిలోని దాతర్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాయిని యాదగిరి(40) భార్య వాణి, కూతురు ఉన్నారు. వ్యవసాయ కూలీ పనులు చూస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురైన అతడు గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి కొండపోచమ్మ కెనాల్ కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

కుటుంబ కలహాలతో యువకుడు...

వెల్దుర్తి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన కానికే శంకర్(22) వ్యవసాయం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శంకర్ తండ్రి వెంకటేష్ కొన్ని నెలల క్రితం మృతి చెందడంతో పిన తల్లి దుర్గమ్మతో గొడవ లు జరుగుతున్నాయి. గురువారం రాత్రి కూడా గొడవ జరగడంతో ఇంట్లో నుంచి బయటకెళ్లి గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి చెల్లి శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తికి సన్మానం

హుస్నాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలో ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కేడం లింగమూర్తిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇందులో గౌరవ అధ్యక్షుడు బత్తిని సాయిలు, అధ్యక్షుడు ముప్పిడి రాజిరెడ్డి, నాయకులు అఫ్జల్, శంకర్, తిరుమలరావు తదితరులున్నారు.

'కొన్ని పాముల్లోనే విషం ఉంటుంది'

ములుగు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పాములన్నిటిలో విషం ఉండదని కొన్నింటిలో మాత్రమే విషం ఉంటుందని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్ఎస్ శ్రీనిధి పేర్కొన్నారు. అటవీ కళాశాల, పరిశోధన సంస్థలో శుక్రవారం ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో పాములపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటవీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్ఎస్ శ్రీనిధి మాట్లాడుతూ.. సమాజంలో సర్పాలంటే అందరికీ ప్రతికూల భావన ఉందని, పాములన్నీ ప్రమాదకరమైనవి కాదన్నారు. కార్యక్రమంలో 120 మందికి పైగా ఎన్ఎస్ఎస్ వలెంటీర్లు, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డీఈఈ సెట్ 2024 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ డీఈఈ సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల అయ్యిందని జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూలు ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 21వ తేదిన జిల్లా ప్రభుత్వ డైట్ కాలేజ్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 23వ తేది నుంచి 26వ తేది వరకు వెబ్ ఆప్షన్లుకు అవకాశం ఉంటుందని, 30వ తేదిన సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. వచ్చే నెల నవంబరు 3వ తేది లోపు ఫీజు చెల్లించి, అడ్మిషన్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు.

'ఎస్టీటీయూని బలోపేతం చేద్దాం'

మర్కుక్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్టీటీ టీచర్లు ఎస్టీటీయూ సంఘాన్ని బలోపేతం చేయాలని సిద్దిపేట జిల్లా సంఘం అధ్యక్షుడు శ్రీరామ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల ఎస్టీటీయూ సంఘం అధ్యక్షుడు ముత్తయ్య, ప్రధాన కార్యదర్శి కమలాకర్‌తో కలిసి మండలంలోని ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్టీటీ ఉపాధ్యాయులకు శుక్రవారం సభ్యత్వ నమోదు చేశారు. వారివెంట ఎస్టీటీయూ సభ్యులు ప్రవీణ్‌రెడ్డి, ఎస్టీటీ టీచర్లు తదితరులున్నారు.

'అపార్' ఎంతో ఉపయోగకరం

చేర్యాల, అక్టోబరు 18: ఆటోమెటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ ద్వారా ప్రతీ విద్యార్థికి జాతీయస్థాయిలో కేటాయించనున్న నెంబరు వారి భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడుతుందని చేర్యాల ఎంఈవో రచ్చ కిష్టయ్య అన్నారు. స్థానిక పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన అపార్ నిర్వహణ, ప్రయోజనాలు ఇతరత్రా అంశాలను వివరించారు. అపార్ పట్ల తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించడంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాటుపడాలని సూచించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

చిన్నకోడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లాయిపల్లి గ్రామ పంచాయతీ నిధుల (2019-2024) దుర్వినియోగంపై సుమారు 6 నెలల క్రితం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ, నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామానికి చెందిన నర్సింగ్, కొమురవెల్లి, శ్రీనివాస్, ఎల్లం, రామచంద్రం ఆరోపించారు. ఈ మేరకు వారు శుక్రవారం కలెక్టర్, డీపీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టి డబ్బులు రికవరీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- రోడ్డు పక్కన పొదలమాటున..
- చుట్టూ కంచె ఏర్పాటు చేయని వైనం
- భయాందోళనలో వాహనదారులు





పుల్లురులో కంచె లేకుండా తక్కువ ఎత్తులో సింగిల్ ఫేజ్ డీటీఆర్, బండచెర్లపల్లి నుంచి పుల్లురు వెళ్లే దారిలో పొదల్లో ..

సిద్దిపేట రూరల్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లోని పలు గ్రామాల్లో రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారులు వాటి చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడం, ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ పొదలు ఏపుగా పెరుగడంతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చేతికి అందే ఎత్తులో..

సిద్దిపేట రూరల్ మండలం బండచేర్లపల్లి నుంచి పుల్లురు వెళ్లే రోడ్డులో, పుల్లురు గ్రామంలో చేతికి అందే ఎత్తులో సింగిల్ ఫేజ్ డీటీఆర్ వద్ద కంచే ఏర్పాటు చేయలేదు. రావురుకల వెళ్లే రోడ్డు పక్కన పలు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ చెట్ల పొదలు పెరగడంతో ప్రమాదం పొంచి ఉంది. నారాయణరావుపేట మండల కేంద్రం నుంచి గుర్రాలగొంది వెళ్లే రోడ్డులో మూలమలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని, వాహనాలు అదుపుతప్పితే ప్రమాదం జరిగే ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు వాపోతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

నిత్యం రైతులు వ్యవసాయ బావుల వద్దకు, ఇతర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఈ రోడ్లపై రాకపోకలు సాగిస్తుంటారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెతో పాటు సూచికబోర్డులు లేకపోవడంతో రైతులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాకాలంలో రోడ్డుపై వర్షం నీరు ప్రవహిస్తుండటంతో తడి వల్ల ఎర్తింగ్ (స్పార్క్) వస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. మూగ జీవాలు పొదల మాటున ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల సపోర్ట్ వైర్లకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడే అవకాశం కూడా లేకపోలేదని రైతులు, గొర్రెల కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పొదలు తొలగించాలి

రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రైతులకు విద్యుత్‌శాఖ అధికారులు అవగహన కల్పించి వ్యవసాయ భూముల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పొదలు తొలగించేలా చూడాలి. తరుచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి.

- జశ్వంత్‌రెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు, సిద్దిపేట



దౌల్తాబాద్: మల్లేశంపల్లిలో క్రీడా ప్రాంగణం

కానరాని ఆటల కిట్లు?

- ఎక్కడున్నాయో అధికారులకే తెలియని దుస్థితి

దౌల్తాబాద్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): పల్లె, పట్టణ క్రీడా ప్రాంగణాలకు గత ఏడాది ఆటల కిట్లు పంపిణీ చేశారు. కొన్నాళ్లు వాటిని మండల పరిషత్ కార్యాలయంలో ఉంచారు. తర్వాత పంపిణీ చేశారు. కానీ క్షేత్రస్థాయిలో వీటి జాడే లేకుండా పోయింది. ఇవి ఎవరి వద్ద ఉన్నాయో అధికారులకు కూడా తెలియడం లేదు. మండల వ్యాప్తంగా 24 గ్రామ పంచాయతీలల్లో నిర్మించిన క్రీడా ప్రాంగణాలకు(టీకేపీ) అప్పటి ప్రభుత్వం ఆటల కిట్లను మంజూరు చేసింది. క్రీడాపరికరాలతో పాటు ఆటగాళ్లకు టీ-షర్టులను కూడా అందజేసింది.

పంపిణీ చేసి మమ అనిపించారు...

ప్రభుత్వం పంపించిన ఆటల కిట్లను స్థానికంగా టీకేపీ(తెలంగాణ క్రీడా ప్రాంగణం) ఉన్న చోట అనుబంధ గ్రామాల యువకులకు పంపిణీ చేశారు. వీటిని ఎక్కాడా ఉపయోగించిన దాఖలాలు లేవు. క్షేత్రస్థాయిలో ఆటల కిట్లు కనిపించకపోవడంపై అధికారులు దృష్టి పెటాల్సిన అవసరం ఉంది.

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- తహసీల్దార్‌కు సీపీఎం వినతి



వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల, అక్టోబరు 18 పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు ప్రభుత్వం వెంటనే సీసీఐ కేంద్రాలను ప్రారంభించాలని కోరుతూ శుక్రవారం సీపీఎం నాయకులు కొమురవెల్లి తహసీల్దారు లక్ష్మీనారాయణకకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ.. పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారని, దీన్ని ఆసరా చేసుకుని దళారులు దోచుకుంటున్నారన్నారు. ఎమ్మెస్పీ ప్రకారం క్వింటాలు ధర రూ.7,300 ఉన్నా ప్రయోజనం చేకూరడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, బక్కెల్లి బాలకిషన్, సార్ల యాదయ్య, సున్నం యాదగిరి, కర్రోల్ల ఎల్లయ్య పాల్గొన్నారు.

కోడిపిల్లల పంపిణీ



కోడి పిల్లను పంపిణీ చేస్తున్న ఏపీఎం

ములుగు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘం మహిళలకు కోడిపిల్లలను పంపిణీ చేశామని ములుగు ఏపీఎం యాదగిరి పేర్కొన్నారు. మండలంలోని వంటిమామిడిలో శుక్రవారం డ్వాక్రా సంఘాలకు చెందిన 100 మంది మహిళలకు ఒక్కొక్కరికి 20 చొప్పున పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో భాస్కర్, స్వామి, ఉమాదేవి పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

చేర్యాల, అక్టోబరు 18: కొమురవెల్లి మండలం ఐనాపూర్ శివారులోని సత్యనారాయణ వ్యవసాయ పొలంలో ఉన్న 16 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసికాపర్ వైర్, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు

జగదేవ్‌పూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం మునిగడపలో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి తెలిపారు. జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వారం క్రితం మునిగడప గ్రామంలో తలారి సురేష్, తన కుటుంబసభ్యులతో కలిసి వారి బంధువు అంత్యక్రియలకు వెళ్లగా గుర్తుతెలియన వ్యక్తి రాత్రి సురేష్ ఇంటిలోకి ప్రవేశించి, ఇంట్లోని 25వేల నగదు, అరతులం బంగారు ఉంగరాన్ని దొంగలించాడు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ నేరానికి పాల్పడిన నిందితుడు తుమ్మ నవీన్‌ను శుక్రవారం జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రమోహన్‌ను, సిబ్బందిని సీఐ మహేందర్‌రెడ్డి అభినందించారు.

రేకుల డబ్బా నుంచి అసంపూర్తి భవనంలోకి..

- సౌకర్యాలలేమిలో పంచాయతీ భవనం
- ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని వైనం



అసంపూర్తిగా ముంగీస్‌పల్లి గ్రామపంచాయతీ భవనం, గతంలో రేకుల డబ్బాలో పంచాయతీ కార్యాలయం (ఇన్‌సెట్‌లో)

రాయపోల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ భవనం అంటే ఆ గ్రామానికి తలమాణికం లాంటిది. ఆయా గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోసం ప్రజలు తరచుగా గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్తుంటారు. కానీ ముంగీస్‌పల్లి పంచాయతీ కార్యాలయం ఏళ్ల తరబడి ఓ కిల్లీ కొట్టులాంటి రేకుల డబ్బాలో కొనసాగింది. ఆ డబ్బా కూడా తుప్పు పట్టి దెబ్బతినడంతో పంచాయతీ కార్యాలయాన్ని సిబ్బంది అసంపూర్తి భవనంలోకి మార్చారు.

పెనం మీద నుంచి పొయ్యిలోకి..

రాయపోల్ మండలం ముంగీస్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఐదేళ్లకు పైగా ఓ కిల్లికొట్టు లాంటి రేకుల డబ్బాలో కొనసాగి ఏడాది క్రితం అసంపూర్తిగా నిర్మించిన భవనంలోకి మారింది. దీంతో సమస్యలు ఎప్పటిలాగానే ఉన్నాయి. సుమారు 6 ఏళ్ల క్రితం ముంగీస్‌పల్లి గ్రామపంచాయతీగా ఏర్పడింది. అప్పట్లో పంచాయతీ కార్యాలయం కోసం గ్రామంలో భవనాలు అందుబాటులో లేకపోవడంతో ఓ రేకుల డబ్బాను తయారు చేయించి అందులోనే కార్యాలయాన్ని ఐదేళ్ల పాటు కొనసాగించారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయం నిర్మాణం కోసం ఆర్జీఎస్‌ఏ పథకం కింద రూ. 20 లక్షల నిధులు మంజూరు కాగా, 2020 సెప్టెంబరు 18న అప్పటి ప్రజా ప్రతినిధులు శంకుస్థాపన చేసి భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో నిర్మాణ పనులు నత్తనడకన సాగి స్లాబ్ వరకు పూర్తయి నిలిచిపోయాయి. దీంతో 2022 ఫిబ్రవరి 21న 'రేకుల డబ్బాలో పంచాయతీ కార్యాలయం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్తను ప్రచురించగా అధికారులు నిర్మాణ పనులను వేగవంతం చేశారు. కానీ నిధులు అయిపోవడంతో ఏడాది క్రితమే భవన నిర్మాణం నిలిచిపోయింది. రేకుల డబ్బా తుప్పు పట్టి దెబ్బ తినడంతో ఏడాది క్రితం అసంపూర్తిగా నిర్మించి ఉన్న ఈ భవనంలోనికి పంచాయతీ కార్యాలయాన్ని మార్చి కొనసాగిస్తున్నారు.

నిధులు మంజూరయ్యాయి

ముంగీస్‌పల్లి పంచాయతీ భవనంలో ఫ్లోరింగ్, విద్యుత్, తలుపులు, కిటికీలు, శానిటేషన్, నీటి సరఫరా తదితర పనులు మిగిలిపోయాయి. ఇందు కోసం ఐదు లక్షల రూపాయలు మంజూరయ్యాయి. గ్రామస్థులు ఎవరైనా ముందుకొస్తే నామినేషన్ పద్ధతిన కాంట్రాక్ట్ పనులు అప్పగించడానికి సిద్ధంగా ఉన్నాం. పెండింగ్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం.

- రాంకుమార్, పీఆర్ఏఈ

జూట్ బ్యాగుల తయారీ పరిశీలన



జూట్ బ్యాగులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

గజ్వేల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి స్కీంలో భాగంగా మహిళా సంఘం సభ్యులకు యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో రుణం అందజేయగా, జూట్ బ్యాగుల తయారీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ జ్యూట్ బ్యాగుల తయారీని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పరిశీలించారు. అనంతరం స్టీల్ బ్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తయారీలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయనవెంట మెప్మా సీవో సరిత, మహిళాసంఘ సభ్యులు ఉన్నారు.

'డీసీసీబీ' సేవలు సద్వినియోగించుకోవాలి

- దుద్దెడ బ్రాంచ్ మేనేజర్ సుధారాణి

కొండపాక, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : డీసీసీ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని దుద్దెడ బ్రాంచ్ మేనేజర్ సుధారాణి సూచించారు. బ్యాంకులో వినియోగదారులతో శుక్రవారం జన సురక్ష కార్యక్రమం వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 సంవత్సరాలుపై బడిన ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండి, సామాజిక భద్రత పథకాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ దుద్దెడ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ హీనా అఫ్రీన్, డీసీసీబీ సిద్దిపేట బ్రాంచ్ మేనేజర్ ఎల్లయ్య, కొండపాక మండలం ఏపీఎం మగ్దూమ్ అలీ, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ సీఎఫ్ఎల్ సాయి క్రిష్ణ, స్వామి, మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా పోతుల శ్రీనివాస్

సిద్దిపేట రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ కిసాన్ మోర్చా నారాయణరావుపేట మండల అధ్యక్షుడిగా పోతుల శ్రీనివాస్ నియమితులైనట్లు బీజేపీ కిసాన్ మోర్చా సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బైతి తిరుపతి తెలిపారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్తు తిరుమల్‌రెడ్డి ఆదేశాల మేరకు పోతుల శ్రీనివాస్‌కు బైతి తిరుపతి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోతుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా నియమించినందుకు మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావుకు, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల శ్రీనివాస్, బైతి కోమురవెల్లి, జాప వెంకటేష్, రాందేని నరహరి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచాలి

- రాయపోల్ ఏవో నరేష్

రాయపోల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేష్ పేర్కొన్నారు. రాయపోల్‌లో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. గడువు ముగిసిన విత్తనాలు, పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు విధిగా రసీదులు అందజేయాలని సూచించారు.

రూ.10 కాయిన్స్‌తో లావాదేవీలు జరుపుకోవాలి: లీడ్ బ్యాంకు మేనేజర్



రూ.10 కాయిన్స్ అందజేస్తున్న హరిబాబు, తదితరులు

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు రూ.10 కాయిన్స్‌తో లావాదేవీలు చేసుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ హరిబాబు తెలిపారు. సిద్దిపేటలోని రైతుబజార్, టోల్‌గేట్ వద్ద ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం రూ.10 కాయిన్స్ మేళను నిర్వహించారు. ఈ సందర్భగా హరిబాబు మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంకు, ఎస్బీఐ బ్యాంకులు కలిసి లక్ష రూపాయల పది రూపాయల కాయిన్స్‌ను ప్రజలకు అందజేసినట్లు తెలిపారు. రూ.10 కాయిన్స్ చెల్లుబాటు లేదని ప్రజలు అపోహలు వదిలి లావాదేవీలు జరుపుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్ సురేష్, ఎస్బీఐ మేనేజర్ రవి తదతరులు పాల్గొన్నారు.

చేర్యాలలో 'లవ్‌రెడ్డి' డైరెక్టర్ సందడి

చేర్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): లవ్‌రెడ్డి సినిమా రిలీజ్ సందర్భంగా డైరెక్టర్ పర్మ స్మరణ్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం తన స్వగ్రామమైన చేర్యాల పట్టణంలో సందడి చేశాడు. ఈమేరకు సినిమాలో నటించిన జ్యోతి, వినోద్, తిలక్‌లతో కలిసి స్మరణ్‌రెడ్డి స్థానికంగా ఉన్న ఓ థియేటర్‌లో సాయంత్రం ఫస్ట్ షోకు హాజరయ్యారు. వీటీకేఎంలో మిత్రులు, అభిమానుల సమక్షంలో ఆయన మాట్లాడుతున్న క్రమంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్ చేసి మాట్లాడారు. ఆల్ ది బెస్ట్ అని అభినందించారు. అలాగే లవ్‌రెడ్డి రిలీజ్ సందర్భంగా డైరెక్టర్లు సుకుమార్, రాంగోపాల్ వర్మ ట్విట్టర్‌లో స్మరణ్‌రెడ్డిని ప్రశంసించారు.



వర్షాలకు కోతకు గురైన రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. అక్కన్నపేట మండలం రామవరం వైన్స్ సమీపంలోని రహదారి, గోవర్ధనగిరి నుంచి రేగొండ వెళ్లే దారిలో కల్వర్టు వర్షాలకు కోతకు గురయ్యాయి. కోతకు గురైన రోడ్లతో ఎదురుగా వచ్చే వాహనాలతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

- అక్కన్నపేట

రెవెన్యూ డివిజన్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

- జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్

చేర్యాల, అక్టోబరు 18: చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఐక్యంగా పోరాడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్ పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న ఓ గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని దశాబ్దకాలంగా ఆందోళనలు కొనసాగుతున్నా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి మంత్రులు, సీఎం రేవంత్‌రెడ్డి తదితరులను కలిసి చేర్యాల గోస వినిపిచేందుకు కార్యాచరణ చేపడుతున్నామన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు ఆడెపు నరేందర్, అందె అశోక్, అందె బీరయ్య, మల్లిగారి యాదగిరి, ఒగ్గు రాజు, కామిడి జీవన్‌రెడ్డి, ఉడుముల భాస్కర్‌రెడ్డి, బస్వగల్ల సిద్దయ్య, అవుశర్ల యాదయ్య, దాసరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి'

బెజ్జంకి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం పార్టీ గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా హమాలీ కార్మికులకు కూడా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ గుర్తింపు కార్డులు అందించి ప్రమాద బీమా వర్తింప చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్, మండల కార్యదర్శి శ్రీనివాస్, ఎల్లయ్య, చంద్రయ్య, సత్తయ్య, రాజు, శ్రీను, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు

సిద్దిపేట కల్చరల్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయుల అభ్యున్నతికి, విద్యార్థుల శ్రేయస్సు కోసం ప్రణాళిక బద్ధంగా పనిచేస్తానని పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. సిద్దిపేటలోని బాలుర ప్రభుత్వ పాఠశాల, బాలికల ప్రభుత్వ పాఠశాల, ఇందిరానగర్ హైస్కూలులో శుక్రవారం ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రాసేనారెడ్డి, పీఆర్టీయూ టీఎస్ నాయకులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

- నంగునూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్టీయూ బలపరిచిన అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఆ సంఘం నంగునూరు మండల శాఖ అధ్యక్షుడు ఎర్ర పార్థసారథి, ప్రధాన కార్యదర్శి కల్లపల్లి రామస్వామి కోరారు. మండలంలోని నర్మెట హైస్కూల్లో ఉపాధ్యాయ ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.
- జగదేవ్‌పూర్: పీఆర్టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డికి మద్దతుగా మండలశాఖ ఆధ్వర్యంలో ఫామ్ 19ను మండలంలో ఓటుహక్కు ఉన్న ప్రతీ ఉపాధ్యాయుడికి అందజేశారు.

'పిల్లలు ఉన్నత స్థితికి చేరుకున్నప్పుడే తల్లిదండ్రులకు ఆనందం'

గజ్వేల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పిల్లలు ఉన్నత స్థితికి చేరినప్పుడే తల్లిదండ్రులకు ఆనందం కలుగుతుందని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.మురళి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాలు, మహిళల రక్షణకు గల చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్లు మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వారివెంట కళాశాల ప్రిన్సిపాల్ భీమ్‌రావు, గజ్వేల్ షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

దుబ్బాక, అక్టోబరు 19: దుబ్బాక మున్సిపాలిటిలోని లచ్చపేటవార్డు ఆదర్శ పాఠశాల విద్యార్థులు గురువారం సిద్దిపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులు మూడు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైయ్యారని ప్రిన్సిపాల్ బుచ్చిబాబు తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పాఠశాలకు చెందిన చామంతి ఏకపాత్రాభినయంలో, యశ్వంత్ వాయిద్యసంగీతంలో, క్రాంతికుమార్ పెయింటింగ్‌లో మొదటిస్థానాలు సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైయ్యారని తెలిపారు. త్వరలో హైద్రాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని ఆయన వెల్లడించారు.

సందడిగా జానపద నృత్య పోటీలు

సిద్దిపేట కల్చరల్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ నూతన పాఠశాల వేదికగా జిల్లాస్థాయి జానపద నృత్యపోటీలు నిర్వహించారు. నేషనల్ పాపులేషన్ ఎడ్యుకేషన్ సెల్, ఎస్సీఈఆర్టీ తెలంగాణ సంయుక్త అధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా పరిధిలోని 26 పాఠశాలల నుంచి 156 మంది 9వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై జానపద నృత్యం చేసిన ఎన్సాన్‌పల్లి తెలంగాణ రెసిడెన్షియల్ స్కూలు విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. ఆరోగ్యకరమైన సంబంధాలు అనే అంశంపైన నృత్య ప్రదర్శన చేసిన అక్కన్నపేట కేజీబీవీ విద్యార్థులు రెండో స్థానంలో నిలిచి నగదు బహుమతిని అందుకున్నారు.



సిద్దిపేట కోమటి చెరువులో ఇటీవల వినాయక విగ్రహాలు, దుర్గామాత ప్రతిమలను నిమజ్జనం చేశారు. దీంతో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో పాటుగా ప్లాస్టిక్, ఇనుముతో చెరువులో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో ఆ వ్యర్థాలను గజ ఈతగాళ్లు ప్రాణాలకు తెగించి తొలగిస్తున్నారు.

- సిద్దిపేట జిల్లా ఫొటో గ్రాఫర్



భారీ వాహనాల ప్రయాణం రోజుల తరబడి సాగుతుంది. డ్రైవర్, క్లీనర్లు వారికి అవసరమైన వస్తువులన్నింటిని తమ వెంటే తీసుకెళ్తారు. ఆ లారీయే వారికి ఆవాసము, వంట గదీనూ. నాగపూర్ నుంచి విజయవాడకు వెళ్తున్న ఓ భారీ వాహనాన్ని దుద్దెడ టోల్‌గేట్ సమీపంలో నిలిపారు. ఆ వాహనం ట్రైలర్ కిందే వారు చపాతీలను తయారు చేసుకుని ఆరగించారు.

- కొండపాక